క్లుప్తంగా

గొల్లపేటలో బోరు పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ అప్పారావు, సర్పంచ్ నాగమణి

మాడుగుల: సత్యవరం పంచాయతీ శివారు గొల్లపేటలో తాగునీటి బోరు పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ 20 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకుతో పాటు ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా జల జీవన్ మిషన్ నుంచి రూ.28 లక్షలు మంజూరయ్యాయి. దీంతో 20 ఏళ్ల నాటి కల ఫలించిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జె్రిపోతుల నాగమణి రామారావు, ఉప సర్పంచ్ వొమ్మలి పెంటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు యలమంచిల రమణ, శనివాడ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై గడ్డికోసే యంత్రాలు



గడ్డికోసే యంత్రం

మాడుగుల: రైతు భరోసా కేంద్రాల్లో 40 శాతం రాయితీపై గడ్డికోసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని ఏడీ వి.చిట్టినాయుడు తెలిపారు. యూనిట్ ఖరీదు రూ.33,970, సబ్సిడీ రూ.13,588 పోను రైతు వాటాగా రూ 20,382 చెల్లించాలన్నారు. ప్రస్తుతం మండలానికి ఐదు యూనిట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా స్థాయి ప్రతినిధి స్వామినాయుడు

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కొంతలంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగు వనరులను ప్రదర్శించి వాటి వినియోగంపై ఆ శాఖ జిల్లా ప్రతినిధి ఆర్. స్వామినాయుడు వివరించారు. దీనిలో భాగంగా కాంపాక్ట్ బ్లాక్‌లో జీవామృతం, పక్షి స్థావరాలు, పసుపు పల్లాలు, లింగార్షక బుట్టలు, వరి పొలంలో అజొల్లా వేసుకునే విధానాన్ని వివరించారు. గట్లపై పలు పంటలను పరిశీలించి రైతులకు మరింత అవగాహన కల్పించారు. దీని వల్ల పురుగులు, తెగుళ్ల ఉద్రిక్తత తగ్గుతుందన్నారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

కరాటే విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

పరవాడ: వెన్నలపాలెంలో పవర్ వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఒకటో రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఎన్టీపీసీకి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. సమీక్షా సాహు రెండు బంగారు పతకాలు, టి.సుమశ్రీ, టి.భవ్యశ్రీ, కె.కె.ఎస్ సాత్విక్ బంగారు పతకం, రాగి పతకాలను కైవసం చేసుకున్నారు. పి.అభి రజత పతకం, డి.ప్రియాన్స్ వెండి పతకం, పి.అజయ్‌కుమార్ వెండి, రాగి పతకం, ఎస్.క్యాతినాథ్ రెండు బంగారు పతకాలు సాధించి సత్తా చాటారు. పోటీల్లో మాస్టర్లు జి.పుష్పారావు, ఎం.తులసీరావు, గొర్లి వంశీ పాల్గొన్నారు.

పెనుగాలులతో భారీ వర్షం

కశింకోట: కశింకోటలో ఆదివారం సాయంత్రం పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. రైతుల్లో ఆనందం నింపింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ముందుగా భారీ వీచాయి. తర్వాత కుండపోత వర్షం కురిసింది. రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తొలి పూజకు వేళాయె!

సకల దేవతాగణాలకు అధిపతి.. అన్ని అడ్డంకులు తొలగించే విఘ్నరాజు.. తొలి పూజకు సిద్ధమయ్యాడు. ఈ నేపథ్యంలో నవరాత్రోత్సవాలకు వాడ వాడలా సర్వం సిద్ధమైంది. గ్రామగ్రామాన మండపాల ఏర్పాటుతోపాటు, విద్యుద్దీపాలంకరణతో ఆలయాలను ముస్తాబు చేశారు.

- గ్రామగ్రామాన మండపాల ఏర్పాటు
- వినాయక చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- మట్టి గణనాథులతోనే మేలు : ఎమ్మెల్యే గణేష్



విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్, ఇతర నాయకులు

మాకవరపాలెం: మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. కొండలఅగ్రహారంలో శారదాంబ పెట్రోల్ బంక్ యజమాని కన్నూరు నాయుడు సమకూర్చిన మట్టి గణపతి విగ్రహాలను ఆదివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో అందరూ మట్టి విగ్రహాలనే వినియోగించాలన్నారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవిందరావు, సచివాలయాల కన్వీనర్ చిటికెల రమణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు పెట్ల భద్రాచలం, మూకల బాలకృష్ణ, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కె.కోటపాడు: ఎ.కోడూరులో గల సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరాలయం

మట్టి గణపతులను పూజించండి

రోలుగుంట: మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని రక్షించాలని ఎస్వో తులసి తెలిపారు. స్థానిక కేజీబీవీలో ఆమె విద్యార్థినులతో మట్టి గణనాథులను తయారీ చేయించారు. లోకాస్ట్.. నోకాస్ట్ పోటీలో 50 వరకూ చిట్టి వినాయకులను తయారు చేసి రంగురంగులతో తీర్చిదిద్దారు. వీటిని ఇక్కడ సిబ్బందికి ఆదివారం పంపిణీ చేశారు.

నాతవరం: చమ్మచింత గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎం.నానాజీ ఆదివారం మట్టి గణపతి విగ్రహాలతోపాటు వినాయక వ్రతకల్ప పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలను ప్రతి ఒక్కరూ పూజించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. చమ్మచింత, తాండవ, పొట్టినాగన్నదొరపాలెం, కె.వి.శరభవరం, రొంగలి కొత్తూరు, తదితర గ్రామాల్లో మట్టి విగ్రహాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు.



రోలుగుంట: కేజీబీవీ విద్యార్థినులు తయారు చేసిన మట్టి గణపతులు

500 మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ప్రభావతి దంపతులు ఆర్థిక సాయంతో 500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. గొల్లవిల్లి రామారావు, వరహాలమ్మ దంపతులు జ్ఞాపకార్థంగా వారి కుమారుడు సంజీవిరావు ఆదివారం వీటిని పంపిణీ చేశారు. మూడేళ్లుగా ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గ్రామస్తులు కలిమి గోసన్న, గోకాడ లక్ష్మీరావు, పోతిన జగదీశ్, పడాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎం. కోడూరు శివాలయంలో సిద్ధి వినాయక ఉపాలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సి.హెచ్.వి.యస్.మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ఉదయం, సాయంత్రం స్వామి వారికి మహా నివేదన ఉంటుందన్నారు.



కె.కోటపాడు: సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరుడు



ఎం. కోడూరులో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సంజీవరావు



చమ్మచింతలో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేస్తున్న సామాజిక కార్యకర్త నానాజీ

బుచ్చెయ్యపేట: వినాయక చవితి నవరాత్రుల ఉత్సవాలకు గ్రామాలు సిద్ధమయ్యాయి. సోమవారం జరిగే వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా గ్రామగ్రామాన యువకులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు వేసి మిరుమిట్లు గొలుపే విద్యుత్ లైటింగ్ సెట్టింగ్‌లు, డీజే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. అడుగు నుంచి 12 అడుగుల పొడవుతో పలు రూపాల్లో వినాయక విగ్రహాలను కొనుగోలు చేసి మండపాలకు తరలించారు. ఆదివారం వినాయక చవితి సామగ్రి కొనుగోలుతో వడ్డాది, బుచ్చెయ్యపేట, సీతయ్యపేట తదితర గ్రామాల జంక్షన్లు, రోడ్లు రద్దీగా దర్శనమిచ్చాయి.

ప్రత్యేకంగా అలంకరించిన మండపాలు

దేవరాపల్లి: గ్రామ గ్రామాన వినాయక చవితి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలను నెలకొల్పేందుకు మండపాలను ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు. సోమవారం తెల్లవార జాము నుంచి వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం దేవరాపల్లి మార్కెట్‌కు వినాయక చవితి శోభ సంతరించుకుంది. పండ్లు, పూలు ఇతర పూజా సామగ్రి కొనుగోలుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో మార్కెట్‌లో సందడి నెలకొంది.



బుచ్చెయ్యపేట విక్రయానికి సిద్ధంగా విగ్రహాలు

కోర్కెలు తీర్చే సిద్ధి బుద్ధి సమేత విఘ్నేశ్వరుడు

కె.కోటపాడు: ఎ.కోడూరులో సిద్ధిబుద్ధి సమేత విఘ్నేశ్వరాలయం చవితి నవరాత్రోత్సవాలకు ముస్తాబైంది. ఇక్కడ 1992లో ఆలయ నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు స్వామి,అమ్మవార్లు నిత్యపూజలు అందుకుంటున్నారు. కోరిన కోర్కెలు తీర్చే విఘ్నేశ్వరునిగా ప్రసిద్ధి చెందడంతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాతోపాటు విజయనగరం జిల్లా నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. సిద్ధిబుద్ధి విఘ్నేశ్వరాలయం అనకాపల్లి జిల్లాలో ఎ.కోడూరులో మాత్రమే ఉంది. ఎంతో విశిష్టత కలిగిన ఆలయంలో నవరాత్రి వేడుకలను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



దేవరాపల్లిలో ముస్తాబైన వినాయక మండపం



దేవరాపల్లిలో వినాయక విగ్రహాన్ని వాహనంలో తీసుకెళ్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

జల్ జీవన్ మిషన్ పనులు ప్రారంభం



వంటర్లపాలెంలో రిగ్గు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

మాడుగుల రూరల్: జలజీవన్ మిషన్‌లో భాగంగా వంటర్లపాలెంలో ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు బోరు తవ్వకం పనులు సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు భూమిపూజ చేసి ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి రూ.74 లక్షలతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామన్నారు. దీనిలో భాగంగా రిగ్గుతో బోరు తీస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, ఉప సర్పంచ్ బొమ్మిశెట్టి వెంకటరమణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దండి బాబూరావు, పాల సొసైటీ మాజీ అధ్యక్షుడు సిద్దాబత్తుల గోవిందరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



కుళాయి కనెక్షన్ల కోసం గోతులు తీస్తున్న కూలీలు(నిన్నటి పేజీ పక్కన ఉంది)

కె.జె.పురంలో కుళాయి కనెక్షన్ల పనులు

మాడుగుల రూరల్: జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు కోసం కె.జె.పురంలో పనులు ప్రారంభమయ్యాయి. రూ.3.30 కోట్లతో 1,550 కుళాయి కనెక్షన్లు వేస్తామని సర్పంచ్ జామి రమణబాబు తెలిపారు. ఈ మేరకు కుళాయి కనెక్షన్లు వేయడానికిగాను ప్రధాన రహదారిలో గోతులు తీస్తున్న పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో గ్రామంలో తాగునీటి సమస్య పూర్తి స్థాయిలో నివారణలో భాగంగా ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు.

ఘనంగా స్వేరో సంబరాలు



2కె రన్‌లో పాల్గొన్న స్వేరో ప్రతినిధులు, విద్యార్థులు

నర్సీపట్నం: స్వేరో అనే పదానికి ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలో చోటు కల్పించడంతో స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి స్వేరో ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం అబిడ్స్ సెంటర్ నుంచి పెదబొడ్డేపల్లి వరకు 2కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర కన్వీనర్ ఎం.చిట్టియ్య, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవమే లక్ష్యంగా స్వేరో పని చేస్తుందన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో సిహెచ్.తలుపులను సన్మానించారు. గోవి సత్యనారాయణ, కోడి రాజుబాబు, పడవల చక్రవర్తి, మురళి, సరమండ వీరబాబు, కనకరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదినం

మాడుగుల రూరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టిన రోజు వేడుకలను ఆదివారం మాడుగులలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవి ఆలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మోదీ పేరు మీద ప్రత్యేక పూజలు చేశారు. విశ్వకర్మ యోజనను 18 కులాల వారు వినియోగించుకోవాలని కోరారు. మాడుగుల బస్టాండు ఆవరణలో మిఠాయిలు పంచి పెట్టారు. పార్టీ మండలాధ్యక్షుడు ఉండూరు రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మండల సంతోషి సుబ్బలక్ష్మి ఏడుగురు సభ్యులకు వస్త్ర తాంబూలాలు అందించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుట్టా రాంబాబు, నియోజకవర్గ కన్వీనర్ మేడపురెడ్డి శ్రీనివాస్, పార్టీ మాజీ అధ్యక్షుడు సాలాపు వీరునాయుడు, మాజీ ప్రజా ప్రతినిధులు దంగేటి సూర్యారావు, వడ్డాది వరలక్ష్మి, జి.జగన్నాథరావు, పాతరపల్లి అప్పారావు, మండల సతీష్, కాశీ, వెంకట్రావు పాల్గొన్నారు.

రావికమతం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు స్థానిక బీజేపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచ దేశాల్లో భారత సత్తా చాటేలా పాలన చేస్తున్న మోదీకి అంతా బలాన్ని చేకూర్చాలన్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గల్లా రాజేశ్వరరావు, మండల నాయకులు పాల్గొన్నారు.



మాడుగులలో మోదీ జన్మదిన వేడుకలో పాల్గొన్న పార్టీ నేతలు



గుడ్డిప ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

జర్నలిస్టులకు అండగా జగన్ ప్రభుత్వం

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: జర్నలిస్టులకు అండగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జాప్) సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలం, అవసరమైన నిధులు ఎంపీ నిధుల ద్వారా మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఇళ్ల స్థలాలు లేని జర్నలిస్టులకు తొందరలోనే పట్టాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. జాప్ రాష్ట్ర అధ్యక్షుడు పున్నంరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. జాప్ యూనియన్ తరపున రూ.5 లక్షల ప్రమాద బీమా బాండ్లను ఎమ్మెల్యే విలేకరులకు అందజేశారు. ఎమ్మెల్యే, ఆర్డీవో హెచ్.వి.జయరాంలను యూనియన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి వేణు, కార్యవర్గ సభ్యులు కోసూరు రామకృష్ణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పులిగా మురళి, లంక శివకుమార్, కోశాధికారి డి.వి.రమణ, గొర్లి రాజు, రాజశేఖర్, జెట్టి శంకర్, జక్కు స్వామినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



మాడుగుల: సత్యవరంలో ప్రత్యేక పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు



వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకల్లో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

మాకవరపాలెం: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కొత్తవీధిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. జి.కోడూరులో విశ్వకర్మ విగ్రహంతో మండపం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. రాచపల్లి జంక్షన్‌లో బీజేపీ నేతల ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, తహసీల్దార్ ప్రసాదరావు, పార్టీ నాయకులు భద్రాచలం, బాలకృష్ణ, ఎంపీటీసీ సర్వేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శేషుకుమార్, ఉప సర్పంచ్ రాము, బీజేపీ నేతలు అడిగర్ల రాంబాబు, చుక్కల శ్రీనివాసరావు, విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

20 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

కె.కోటపాడు: చౌడువాడలో విశ్వకర్మ జయంతి వేడుకలను గ్రామానికి చెందిన విరాట్ విశ్వకర్మ సేవా సంఘం సభ్యులు ఆదివారం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 20 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కోరుకొండ సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

సత్యవరంలో...

మాడుగుల: విశ్వ బ్రాహ్మణ సహకార సంఘం ఆధ్వర్యంలో సత్యవరంలో ఆదివారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సంఘ సభ్యులు చుక్కా అప్పలరాజు, బల్లంకి రాము, చుక్కా సత్తిబాబు, చుక్కా అప్పారావు, బలలకి గణేష్, గోపాసిన అచ్చిబాబు, ద్వారపూడి పైడిబాబు, పైడి బాబూరావు, ద్వారపూడి గిరిబాబు, బలలకి సూర్యనారాయణ, గోపాసిన కన్నబాబు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి వేడుకలను ఆదివారం వడ్డాదిలో వేడుకగా నిర్వహించారు. వడ్డాది చెరకు కాటా వద్ద వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణులంతా పాల్గొన్నారు.

రావికమతం: కొత్తకోట వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో విశ్వబ్రాహ్మణులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

గ్రంథాలయంలో..

చోడవరం రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ముందుగా విశ్వకర్మ చిత్రపటాన్ని ఆవిష్కరించి, పూలమాల వేసి జ్యోతి ప్రజల్వన చేసి గ్రంథపాలకురాలు జి.తిరుమలకుమారి, పాఠకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ సేవలను గ్రంథాలయ పాఠకులకు ఆమె వివరించారు.



కె.కోటపాడు: చౌడువాడలో నిరుపేదలకు దుప్పట్లు అందిస్తున్న దృశ్యం



మాకవరపాలెంలో విశ్వకర్మ జయంతి పూజలు



చోడవరం గ్రంథాలయంలో విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులు



కొత్తకోట ఆలయంలో పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

వినాయక మండపాలకు నిబంధనలు తప్పనిసరి

నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య



నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య



సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్

నాతవరం: వినాయక చవితి మండపాలకు పోలీసుల అనుమతి విధిగా తీసుకోవాలని నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య తెలిపారు. ఆయన ఆదివారం నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అనంతరం మాట్లాడుతూ వినాయక చవితి పండగ పేరుతో కొందరు స్వార్థ రాజకీయం చేయాలని చూస్తున్నారని, అలాంటి వారి పట్ల ఉపేక్షించేది లేదన్నారు. ఎస్పీ ఆదేశాల బేఖాతరు చేస్తూ ఎక్కడైనా అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే కేసు పెడతామన్నారు. ఈ విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదన్నారు. నాతవరం మండలంలో సమస్యాత్మక గ్రామాలను ముందు జాగ్రత్తగా ఇన్‌చార్జి ఎస్ఐ రామకృష్ణ పరిశీలించారన్నారు. అవసరమైతే కానిస్టేబుల్‌ను మఫ్టీలో ఉంచుతామన్నారు.

రావికమతం: వినాయ క చవితి పండగలకు, లౌడ్ స్పీకర్లకు, మండపాలకు సర్కిల్ పరిధిలోని రావికమతం, కొత్తకోట, బుచ్చెయ్యపేట, రోలుగుంట మండలాల పోలీసు స్టేషన్ల అనుమతి ముందుగా తీసుకోవాలని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ ఆదివారం తెలిపారు. పండగలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. ప్రాణ నష్టం లేకుండా తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించిన డ్రైవర్లు ఉత్సవ వాహనాలు నడపవద్దన్నారు. నిమజ్జనం ప్రాంతం, రోజు తమకు తెలియజేస్తే బందోబస్తు కల్పిస్తామన్నారు.

గొర్రెలు, మేకల పెంపకందార్లకు రుణాలివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరామ్

కశింకోట: గొర్రెలు, మేకల పెంపకందారులకు రుణాలు ఇవ్వాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. మండలంలోని తేగాడలో ఆదివారం గొర్రెలు, మేకల పెంపకందార్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత పశు వైద్యం, గొర్రెలు, మేకలు రాత్రి వేళ బసలకు స్థల కేటాయింపు, ఉపాధి పథకంలో షెడ్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. నట్టల నివారణ మందులు ఏడాదికి నాలుగు సార్లు ఇవ్వాలని, అన్ని వాక్సిన్లు ఉచితంగా అందించాలన్నారు. తెలంగాణా రాష్ట్రం తరహాలో గొర్రెలు, మేకలు పెంపకందారులకు బీమా సదుపాయం కొనసాగించాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ సర్వసిద్ధి తాతారావు, ప్రతినిధులు పల్లా వెంకయ్యనాయుడు, చందక నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం

పరవాడ: వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎం నెలరోజులుగా మూతపడడంతో వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం పరిసర గ్రామాలకు చెందిన బ్యాంకు ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. ఏటీఎం పని చేయకపోవడంతో బ్యాంకు లావాదేవీలు జరపడానికి దీపాంజలినగర్, పరవాడ ప్రాంతాల్లోని ఏటీఎంలపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల అవస్థలను గుర్తించి వాడచీపురుపల్లి కూడలిలోని ఏటీఎం సెంటర్‌ను వినియోగంలో తీసుకురావడానికి బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు. సాంకేతిక పరమైన మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని మేనేజర్ జి.కె.కిరణ్‌కుమార్ తెలిపారు.